
సాక్షి
బాపట్ల
గురువారం । 9 । అక్టోబర్ । 2025



ఈవీఎంల గోదాము తనిఖీ

బాపట్ల : స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన గోదామును బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 97,327 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 95,327 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 42.1600 టీఎంసీలు.



అందుబాటులోకి 108 వాహనం

పొన్నూరు: పొన్నూరు ప్రజలకు 108 వాహన సేవలు అందుబాటులోకి వచ్చాయి. కలెక్టర్ ఆదేశాలతో 108 వాహనం అందుబాటులోకి వచ్చినట్లు తెలిసింది.

తీరంలో ధ్వంస రచన

తీరం అక్రమార్కులకు అడ్డాగా మారింది. రాజకీయ బలం ఉన్నవారికి ఆవాసంగా మారింది. తీరాన్నే నమ్ముకుని తరాలుగా జీవిస్తున్న మత్స్యకారులకు పరాయి ప్రాంతంగా మారింది. కోస్టల్ రెగ్యుల్ జోన్ (సీఆర్‌జెడ్) చట్టం మత్స్యకారులకు మాత్రం చట్టంగా, రాజకీయపార్టీల అండదండలున్న వారికి చుట్టంలా మారింది. సముద్ర తీర ప్రాంతానికి 250 మీటర్ల దూరంలో ఎలాంటి కట్టడాలు నిర్మించవద్దని సుప్రీం కోర్టు ఆదేశించినా ఎవరూ ఖాతరు చేయడంలేదు. అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో తీరంలో ధ్వంస రచన మొదలైంది.

- పర్యావరణానికి విఘాతం
- సీఆర్‌జెడ్ చట్టానికి తూట్లు
- తీరంలో వెలుస్తున్న భవనాలు, రిసార్టులు
- అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండాదండా


సీఆర్‌జెడ్ పరిధిలో తీరం ఒడ్డునే నిర్మించిన రిసార్టు


రిసార్టుల నిర్మాణానికి మడ అడవుల తొలగింపు

చీరాల టౌన్ : మినీ గోవాగా వాడరేవు, రామాపురం, సూర్యలంక ప్రాంతాలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందడంతో వారాంతపు సెలవుల్లో వేలాది మంది సముద్ర తీరానికి వస్తున్నారు. దీంతో బస చేసేందుకు రిసార్టులు దొరికే అవకాశం లేకుండా పోతోంది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని గ్రామాలు, మండలాల్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) మరింత విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ (సీజెడ్‌ఎం) ప్లాన్ తీసుకురానుంది.

సునామీ నుంచి గుణపాఠం రాదా?

2004లో సునామీ ఉపద్రవం సంభవించి సముద్ర తీర ప్రాంతాల్లో నివశించే పలువురు మత్స్యకారులు, ప్రజలు అసువులు బాశారు. దీంతో ప్రభుత్వం కోస్టల్ రెగ్యులర్ జోన్ (సీఆర్‌జెడ్) చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం సముద్ర తీర ప్రాంతాలకు 500 మీటర్ల సమీపంలో ఎలాంటి శాశ్వత కట్టడాలు, భవనాలు నిర్మాణం చేయకూడదని స్పష్టంగా ఆదేశించింది. ఆ తర్వాత దాన్ని పరిధిని 250 మీటర్లు వరకు కుదించారు. ఇదే అదునుగా భావించిన బడా బాబులు, రియల్టర్లు తీరం ఒడ్డున అక్రమంగా రిసార్టులు నిర్మిస్తున్నారు.

యథేచ్ఛగా భూముల ఆక్రమణ

గోకులం,సీలింగ్ ల్యాండు, సొసైటీ భూములను ఆక్రమించుకుని రిసార్టులు, విల్లాలు, కాటేజీలు నిర్మిస్తున్నారు. ప్రకృతి విపత్తులు, భారీ వర్షాల సమయంలో సముద్రం ఉప్పొంగి నీరు బయటకు వస్తుంది. ఈ సమయంలో నష్టాలు జరగకుండా ప్రభుత్వం సీఆర్‌జెడ్ చట్టాన్ని తీసుకువచ్చింది. అకాల వర్షాలు, తుఫాన్లు, సునామీ, అల్పపీడనాలు వంటి పకృతి వైపరీత్యాల కారణంగా సముద్రం ఉగ్రరూపం దాల్చి అల్లకల్లోలంగా మారే సమయంలో ఇది ఉపయోగపడుతుంది.

రిసార్టులు, భవనాలకు అనుమతులు ఇవ్వలేదు

సముద్ర తీర ప్రాంతాల్లో భవనాలు, రిసార్టులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. సీఆర్‌జెడ్ పరిధిలో నిర్మాణాలు చేసిన వారిపై చర్యలు తప్పవు. నేను కొత్తగా బాధ్యతలు చేపట్టాను. ఆక్రమణలపై పూర్తి సమాచారం తీసుకుంటా!

– గీతారాణి, తహసీల్దార్, వేటపాలెం

చట్టం చుట్టుబండలు

చీరాల వాడరేవు నుంచి సింగరాయకొండ మండలంలో కరేడు వరకు 76 కిలో మీటర్ల సముద్ర తీర ప్రాంతం పాటు ఏడు మత్స్యకార మండలాల్లో చట్టం చట్టుబండలుగా మారింది. చీరాల వాడరేవు, రామాపురం, కఠారిపాలెం సముద్ర తీర ప్రాంతాల్లో అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికార పార్టీ అండదండలతో బడా బాబులు అసైన్డ్ భూముల్లో ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. అక్రమ కట్టడాలు, రిసార్టులకు ఎన్‌వోసీ ఇచ్చి పంచాయతీరాజ్ అధికారులు రూ. లక్షలు గడిస్తున్నారు. ఈ అక్రమ కట్టడాలకు విద్యుత్ సౌకర్యాలను ఆ శాఖ అధికారులు యథేచ్ఛగా ఇచ్చేస్తున్నారు.

ఈవెంట్లతో దోపిడీ

తీర ప్రాంతంలో సరివి చెట్లు, అడవులు, ఇసుక దిబ్బలను చదును చేసి పర్యాటకులకు అనువుగా ఈవెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవెంట్ల పేరుతో దోపిడీ చేస్తున్నా పంచాయతీరాజ్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, సీఆర్‌జెడ్ శాఖలు ఏం చేస్తున్నాయో అర్థం కాకుండా ఉంది. ఈవెంట్ల నిర్వహణకు సముద్ర కెరటాల నుంచి మత్స్యకార గ్రామాలను రక్షించే మడ అడవులను రిసార్టు యాజమాన్యాలు తొలగిస్తున్నాయి.

ఎన్‌సీసీ బెటాలియన్ సందర్శన



చీరాల టౌన్: చీరాలలోని 23వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్, ఎయిర్ కమడోర్ సర్బింగ్ సైలానీ తనిఖీ చేశారు. 23వ ఆంధ్రా బెటాలియన్ పరిధిలోని కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో అందిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ, క్యాడెట్లు, తదితర వివరాల రికార్డులను ఆయన పరిశీలించారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సేవా గుణం, సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు చుక్కానిలా పని చేస్తుందన్నారు. ఎన్‌సీసీ సీ–సర్టిఫికెట్ వల్ల ఉద్యోగాలు, ఉన్నత చదువుల్లో కోటా లభిస్తుందన్నారు. క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు ఎన్‌సీసీ మార్గదర్శన్నారు. ఎన్‌సీసీ అధికారులు, మిలిటరీ సిబ్బంది విద్యార్థులకు చక్కగా తర్ఫీదును అందించాలన్నారు. అనంతరం ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సీఏటీసీ క్యాంపులో పతకాలు సాధించిన మణికుమార్, లిఖిత, బెటాలియన్ క్యాడెట్లను సత్కరించి ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు పురస్కారాన్ని అందించారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ పరిధిలో చక్కటి శిక్షణ అందించిన కాంటిజెంట్ కమాండర్ మేడికొండ రాజేష్‌బాబును అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్. దూబే, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి, ఏవో ఎస్.ఎస్, పర్మర్, మేజర్ రాజు, అంజిరెడ్డి, దివ్య, సుబేదార్లు అవతార్‌సింగ్, రణ్వీర్ సింగ్, జేసీవో మహ్మద్ సబూర్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

హోంగార్డుల డ్రిల్ పరేడ్‌ను పరిశీలించిన జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్



చీరాల రూరల్ : విధుల్లో అలసత్వం వహించకుండా అంకిత భావంతో పనిచేసి హోంగార్డులు పేరు తెచ్చుకోవాలని బాపట్ల జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ సూచించారు. స్థానిక ఎస్‌ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో హోంగార్డుల డ్రిల్ పరేడ్‌ను బాపట్ల జిల్లా రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల సబ్ డివిజన్‌లోని 12 పోలీసు స్టేషన్లకు చెందిన హోంగార్డులందరూ డ్రిల్ పరేడ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ శరీర దారుఢ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ వాకింగ్, జాగింగ్ వ్యాయామాలు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరైనా ఇబ్బందులకు గురైనట్లయితే ఉన్నతాధికారులకు తెలియపరచాలని చెప్పారు. హోంగార్డులకు సంబంధించిన వెల్ఫేర్ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డ్రిల్ పరేడ్‌లో సబ్ డివిజన్ పరిధిలోని హోంగార్డులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ ఫార్మా డీ పరీక్షలు ప్రారంభం



ఏఎన్‌యు(పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి బీ ఫార్మసీ రెండవ సెమిస్టర్ (రెగ్యులర్), ప్రథమ సెమిస్టర్ (సప్లిమెంటరీ)పరీక్షలతో పాటు ఫార్మాడీ పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. బీ ఫార్మసీ పరీక్షలు 18 కేంద్రాల్లోను, ఫార్మా డీ పరీక్షలు 10 కేంద్రాల్లో జరుగుతున్నాయి. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయ కర్త ఆచార్య ఎం.సుబ్బారావు నరసరావుపేటలోని ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తిని బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పూల మొక్కను అందించారు. శాంతి భద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కోసం న్యాయశాఖ, పోలీస్ శాఖ నిర్వహించాల్సిన పలు అంశాలపై చర్చించారు. జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడం, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టేందుకు అవసరమైన పరిపాలనా, చట్టపరమైన చర్యలపై చర్చించారు. జిల్లా ప్రజలకు సమర్థ, నిష్పాక్షిక సేవలు అందించాలని అభిప్రాయపడ్డారు.

యోగా ముగింపు ఆనంద మహోత్సవం



మంగళగిరి టౌన్ : మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని యూపీ స్కూల్‌లో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 11వ ఉచిత మహిళా యోగా శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ యోగా ముగింపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగ సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు శ్రీ యధాశక్తి యోగి గురూజీ హాజరయ్యారు. మహిళా యోగా సాధకులు పలు యోగాసనాలు ప్రదర్శించారు. పలువురు యోగా సాధకులు మాట్లాడుతూ యోగ సాధన వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక రుగ్మతలు కూడా తొలగుతాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు యోగా సాధనలో శిక్షణ ఇప్పించడానికి ఆసక్తి కనబర్చాలన్నారు. మహిళలు యోగా శిక్షణకు వెళితే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగా సేవా కేంద్ర ప్రతినిధి కీర్తియోగి మాతాజీ, యోగా సాధకులు పద్మలత, సుజాత, పద్మ పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న నకిలీ మద్యం

- అవన్నీ సీబీఎస్, పీకే, ఎల్కే బ్రాండ్లే
- వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజం



సంతనూతలపాడు: ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు ఇస్తామని దేశంలో ఎక్కడా లేని వింత వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 16 నెలలుగా నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 85 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వాల్సి ఉండగా కేవలం 40 నుంచి 50 లక్షల మందికే అందజేశారని విమర్శించారు. లైసెన్సు ఉన్న డ్రైవర్లందరికీ ఆర్థిక సాయం అందజేస్తానన్న చంద్రబాబు కేవలం ఆటోలు తోలే డ్రైవర్లకు అది కూడా కోత విధించడం దారుణమన్నారు. పేదలకు ఇళ్లు కట్టి ఇస్తామని ఆశ పెట్టి అధికారంలోకి వచ్చి మాట తప్పారన్నారు. నకిలీ మద్యం సరఫరాతో చంద్రబాబు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో బూం బూం అంటూ విమర్శలు గుప్పించిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ బ్రాండ్‌తో పాటు సూపర్ సిక్స్ అనే బ్రాండ్ మద్యాన్ని కూడా అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమలో నకిలీ మద్యం ప్లాంట్లు రెండు బయటపడడం, వీటి వెనుక టీడీపీ కీలక నేతలే ఉండడం, ఉత్తరాంధ్రలోనూ నకిలీ మద్యం ప్లాంట్లు ఉన్నాయని సమాచారం రావడంతో రాష్ట్రంలో మద్యం ప్రియుల వెన్నులో వణుకు పుడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తోందని ప్రజలకు అర్థమైందన్నారు. నకిలీ మద్యం ఎలా తయారు చేయాలో కూటమి నాయకులకు ఆఫ్రికాలో శిక్షణ ఇచ్చి ఆ ఫార్ములా ద్వారా నకిలీ మద్యాన్ని ప్రభుత్వ పెద్దలే ఏరులై పారిస్తున్నారని విమర్శించారు.

మందు తాగొద్దు.. తస్మాత్ జాగ్రత్త:
ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక కలుగు నాయుడుగా మిగిలిపోయారని మేరుగ నాగార్జున ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో అరవటం, రెచ్చిపోవటం, ఊగి పోవటం, తూగిపోవటం, జుట్టు పీక్కోవటం లాంటి చేష్టలు చేసిన ఆయన ఇప్పుడు మహిళలపై ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా మాట్లాడకుండా కలుగులోనే ఉంటున్నారని విమర్శించారు. సొంత అన్నయ్యను బాలకృష్ణ అగౌరవపరిచినా బయటకు రాకపోవడం దారుణమన్నారు. పవన్ కళ్యాణ్ నిజస్వరూపాన్ని ఇప్పుడు ప్రజలు చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం అని వ్యాఖ్యానించిన కూటమి నాయకులు ప్రస్తుతం సీబీఎస్, పీకే, ఎల్కే బ్రాండ్లు తయారు చేసి వైన్ షాపులు, బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతి మద్యం బాటిల్‌ను డిస్టిలరీల్లోనే తయారు చేశారని, ఇప్పుడు టీడీపీ నాయకుల ఇళ్లలోనే నకిలీ మద్యం తయారవుతోందని ధ్వజమెత్తారు. మందు బాబులు ఈ మద్యం తాగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. కూటమి సర్కారు పాపాలు పండే రోజు దగ్గర్లోనే ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో అశ్రద్ధ వద్దు !

కలెక్టర్ వి.వినోద్‌కుమార్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో ఉంచేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు ప్రతి మండలంలో ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేశామని, ఆయన వసతి గృహాలను దత్తత తీసుకొని పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో పూర్వ విద్యార్థులను మమేకం చేసుకొని వారి ద్వారా మెరుగుపరచాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో లోపల, బయట పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని ఆయన తెలిపారు. సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. గ్రామస్థాయి అధికారులు ప్రజలను కలిసేటప్పుడు గుర్తింపు కార్డులు ధరించాలని కలెక్టర్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీని తనిఖీ చేసి నివేదికను తయారు చేయాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడు వారి నుంచి సానుకూల స్పందన వస్తుందని, ఆ దిశగా పని చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో స్వామిత్వ సర్వేని వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. 205 రెవెన్యూ గ్రామాల్లో స్వామిత్వ సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని చెప్పా. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చే అర్జీల ఆడిటింగ్, ఈ–క్రాప్ నమోదు, సీసీఆర్సీ కార్డుల జారీ తదితర విషయాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి. గంగాధర్ గౌడ్, ఏపీఓ అనూరాధ, డీపీఓ ప్రభాకర్, ఇన్‌చార్జి పీడీడీఆర్‌డీఏ లవన్న, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కనక ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ప్రకాశరావు, వీక్షణ సమావేశం ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన వైస్ ప్రిన్సిపాల్


విద్యార్థి పాల్ గాంధీ (ఫైల్)


వైస్ ప్రిన్సిపాల్ కొట్టడంతో వాచిన చేయి

చెరుకుపల్లి: బాపట్ల జిల్లా గుళ్లపల్లి ఎస్ఆర్ఐ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి పాల్ గాంధీని వైస్ ప్రిన్సిపాల్ విచక్షణ రహితంగా కొట్టగా ఆస్పత్రి పాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తల్లిదండ్రుల వివరాల మేరకు... గుళ్లపల్లి శివాలయం కాలనీకి చెందిన విద్యార్థి చల్లా పాల్ గాంధీకి, యశ్వంత్ అనే విద్యార్థితో ఈ నెల 7న క్లాస్‌రూమ్ బెంచ్‌పై కూర్చునే విషయంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయ్ తరగతి గదికి వచ్చి విద్యార్థులను అడగ్గా పాల్‌గాంధీ యశ్వంత్‌ను కొట్టాడని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన వైస్ ప్రిన్సిపల్ పాల్‌గాంధీపై తన మోచేతితో వీపుమీద గుద్దుతుండగా దెబ్బలు తట్టుకోలేక చెయ్యి అడ్డం పెట్టాడు. చేతి వేళ్లు విరగడంతో తొలుత రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్, ఎక్సరే తీయగా కుడి చేతి వేలి ఎముక విరిగినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

ఏఎన్‌యూ వీసీగా సత్యనారాయణ రాజు



ఏఎన్‌యూ(పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఆచార్య సామంతపూడి వెంకట సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ నజీర్ అహ్మద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య సత్యనారాయణరాజు ఇప్పటి వరకూ వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎంటోమాలజీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఏఎన్‌యూలో గత కొంతకాలంగా ఇన్‌చార్జి వీసీగా ఆచార్య కె. గంగాధరరావు విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణరాజు అగ్రికల్చర్ బీఎస్సీని మహారాష్ట్రలోని డాక్టర్ పుంజాబ్‌రావు క్రిషి విద్యాపీఠ్ నుంచి 1983లో ఉత్తీర్ణులయ్యారు. ఎంఎస్సీ అగ్రికల్చర్ కోర్సును హిమాచల్‌ప్రదేశ్‌లోని డాక్టర్ వైఎస్ పర్మార్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్టికల్చర్ అండ్ ఫారెస్ట్రీ నుంచి 1986 లోనూ, అగ్రికల్చర్ ఎంటోమాలజీలో పీహెచ్‌డిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి 1990లో పొందారు. బోధన రంగంలో 28, పరిశోధనా రంగంలో 32 సంవత్సరాల అనుభవం గడించారు. రైతులు అనుబంధ అంశాల్లో 28 సంవత్సరాలకు పైగా పాలు పంచుకున్నారు.

పలు కమిటీల్లో సభ్యత్వం

యునైటెడ్ కింగ్‌డమ్ దేశానికి చెందిన వరల్డ్ బీ ప్రాజెక్ట్ ఎడ్వైజరీ బోర్డుకు, నాగాలాండ్ సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీకి, బెనారస్ హిందూ యూనివర్సిటీలోని పలు కమిటీలు, పలు జాతీయ స్థాయి పరిశోధనా సంస్థల బోర్డుల్లోనూ సభ్యుడిగా సత్యనారాయణరాజు వ్యవహరించారు. 2017లో అలహాబాద్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎన్విరాల్‌మెంటల్ కాన్సర్వేషన్ అవార్డును, అదే ఏడాది వారణాసిలోని మహిమా రీసెర్చ్ ఫౌండేషన్ అండ్ సోషల్ వెల్ఫేర్ నుంచి లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎన్‌సీసీ నుండి బెస్ట్ ఏఎన్‌ఓ అవార్డును అందుకున్నారు. 2018లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రో ఎన్విరాల్‌మెంట్ సొసైటీ నుంచి ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డును, ఒరిస్సా రాష్ట్రంలోని అఫ్‌లెడ్ జువాలజిస్ట్ అండ్ రీసెర్చ్ సంస్థ నుండి డాక్టర్ ఆనంద్ ప్రకాష్ అవార్డును, 2019లో అలహాబాద్ యూనివర్సిటీ నుండి అగ్రికల్చరిక్ ఎచీవ్‌మెంట్ అవార్డును పొందారు. ప్రస్తుతం ఎంటోమాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫెలోగా కొనసాగుతున్నారు. ఈయన పర్యవేక్షణలో ఇప్పటి వరకూ తొమ్మిది మందికి పీహెచ్‌డీలు, 34 మందికి పీజీ సంబంధిత డిగ్రీలు చేశారు. అమెరికా చైనాతో పాటు పలు దేశాలను సందర్శించి, పలు అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఏఎన్‌యూలో ప్రస్తుతం ఏడాదిన్నరగా తాత్కాలిక వీసీగా విధులు నిర్వహిస్తున్న ఆచార్య కె. గంగాధరరావును తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన వీసీగా ఆచార్య ఎస్ వెంకటసత్యనారాయణరాజు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి

జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, పక్కన జెడ్పీ సీఈవో జ్యోతిబసు

గుంటూరు ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీఎం సాయికుమార్ పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 'థీమ్–5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్'పై రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో సాయికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్ర పరిస్థితులు, అధ్వాన్న వాతావరణం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చునని తెలిపారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతల ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా సత్ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీపీఆర్సీ రీసోర్స్ పర్సన్ రామకృష్ణ, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలే బెస్ట్!

క్లుప్తంగా

విచారణకు పిలిచారు.. వాయిదా వేశారు



మాచర్ల: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బోదిలవీడు గ్రామంలో గత కొన్ని నెలల క్రితం జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) సోదరులపై అక్రమ కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీఆర్కే సోదరులకు అనుకూలంగా సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఇదేకేసులో రెండోసారి విచారణకు రావాలని పీఆర్కే సోదరులకు నోటీసులు ఇచ్చి బుధవారం విచారణకు పిలిచారు. ఉదయం 10 గంటలకు విచారణ వాయిదా వేస్తున్నట్లు, ఈనెల 10వ తేదీన విచారణకు రావాలని మళ్లీ నోటీసులు ఇచ్చారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

సత్తెనపల్లి: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా అర్ధరాత్రి తరలిస్తుండడంతో పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి నుంచి పరస రబ్బాని, షేక్ సుభాని, షేక్ ఇర్ఫాన్, గుంటూరు ప్రసాద్, తులసీకృష్ణలు టాటా ఏస్ వాహనంలో 720 కిలోల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని వెళుతుండగా అందిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని గార్లపాడు సెంటర్‌లో దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గోదాములో రెవెన్యూ అధికారులకు అప్పగించారు. టాటా ఏస్ వాహనాన్ని సీజ్ చేసి పట్టుబడిన ఐదుగురిని బుధవారం కోర్టులో హాజరపరిచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

కందిపప్పు కమీషన్ ఏజెంట్ నివాసంలో సోదాలు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) :కంది పప్పు కమీషన్ ఏజెంట్ వెంకటేశ్వరరావు నివాసంలో ఆదాయ పన్ను అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. గుంటూరు పట్నం బజార్‌లో గల కమీషన్ కార్యాయలంతో పాటు లక్ష్మీపురంలోని ఆయన నివాసం, నగరంపాలెం మస్తాన్‌దర్గా రోడ్డులో గల ఫ్లాట్‌లో ఆదాయపు పన్ను అధికారులు సోదాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు నుంచి సరకులు కొనుగోలు చేసిన ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని మిల్లర్ల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే బ్యాంకు లాకర్లలో భద్రపరచిన బంగారం, ఆస్తుల వివరాలను కూడా సేకరించారు.

స్క్రీనింగ్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్

- రొమ్ము కాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం
- ప్రతి ఎనిమిది మంది మహిళల్లో ఒకరు రొమ్ము కాన్సర్ బాధితులే
- అక్టోబరు రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం

ఆధునిక జీవన శైలి వల్ల 50 ఏళ్లు దాటిన తరువాత వచ్చే రొమ్ము క్యాన్సర్లు నేడు 25 ఏళ్లకే కనిపించడం సర్వత్రా ఆందోళనకు దారి తీస్తోంది. విద్యావంతులు, చదువులేనివారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన లేకుండా నిర్లక్ష్యంగా ఉండటం వల్లే ప్రతి ఏడాది రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని బారిన పడకుండా ప్రతి ఏడాది అక్టోబరు నెల రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిసున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: పేదల పెద్దాసుపత్రిగా పేరు గడించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే వైద్య పరికరం మెమోగ్రఫీ వైద్య పరికరం అందుబాటులో ఉంది. నాట్కో ట్రస్ట్ వారు రూ. కోటి విలువైన త్రీడీ డిజిటల్ మెమోగ్రఫీ వైద్య పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు. మెమోగ్రామ్ పరీక్ష చేసినందుకు ప్రైవేటు ఆస్పత్రుల్లో సుమారు రూ. 2వేలు వరకు ఫీజు తీసుకుంటున్నారు. జీజీహెచ్‌లో వ్యాధి నిర్ధారణతోపాటు, రొమ్ము క్యాన్సర్ బాధితులకు అవసరమైన ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ఆపరేషన్‌ల అనంతరం అవసరమయ్యే రేడియేషన్ థెరఫీ, కిమోథెరఫీ వైద్య సేవలు సైతం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్‌సెంటర్‌లో పూర్తి ఉచితంగా అందిస్తున్నారు.



జీజీహెచ్ నాట్కో క్యాన్సర్‌సెంటర్

మెమోగ్రామ్ పరీక్షలు చేయించుకున్నవారి వివరాలు ...

జీజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష మెమోగ్రామ్ 2023లో 368 మంది, 2024లో 381మంది, 2025 సెప్టెంబరు వరకు 381 మంది పరీక్షలు చేయించుకున్నారు. రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతూ 2022లో 34 మంది, 2023లో 73 మంది, 2024లో 69 మంది, 2025 సెప్టెంబరు వరకు 55 మంది రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్ చేయించుకున్నారు.

తొలిదశలోనే గుర్తించవచ్చు



తొలి దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు మెమోగ్రామ్ పరీక్ష చేస్తారు. మెమోగ్రామ్‌తో రెండు మి.మీ కన్నా తక్కువ సైజులో రొమ్ములో గడ్డలు ఉన్నా గుర్తించి వెంటనే వైద్యం చేయవచ్చు తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే వ్యాధి నుంచి త్వరిత గతిన కోలుకోవటంతోపాటుగా మరణాన్ని తప్పించవచ్చు. మహిళలే స్వయంగా రొమ్ము పరీక్ష చేసుకుని రొమ్ములో ఏమైనా గడ్డలు ఉన్నట్లు అనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

స్క్రీనింగ్ పరీక్షలతో చెక్



మహిళలంతా మెమోగ్రామ్, బయాప్సి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రథమ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు. కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా ముందస్తుగా జనటిక్ పరీక్ష చేయించాలి. సంతానం లేనివారికి, ఆలస్యంగా పిల్లలు పుట్టిన వారికి సైతం రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. రొమ్ము క్యాన్సర్‌లకు రేడియేషన్ థెరపీ, కిమో థెరపీ, ఆపరేషన్‌లు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

ఉచితంగా రొమ్ము క్యాన్సర్ ఆపరేషన్లు...



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా రొమ్ము క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేలా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశాం. గత ఏడాది 69 మందికి, ఈఏడాది ఇప్పటివరకు 55 మందికి ఉచితంగా క్యాన్సర్ ఆపరేషన్లు చేశారు. నన్నపనేని లోకాధిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో సెంటర్‌లో 24 గంటలు కార్పొరేట్ ఆస్పత్రుల కంటే ధీటుగా ఉచితంగా క్యాన్సర్ వైద్యసేవలను అందిస్తున్నారు.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన చీరాల క్రీడాకారులు

చీరాల రూరల్: జిల్లాస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 6న ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2025-26 ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను స్కూల్‌గేమ్స్ జిల్లా సెక్రటరీ, రాష్ట్ర తైక్వాండో వైస్ ప్రసిడెంట్ షేక్ అబ్దుల్ సలాం పర్యవేక్షణలో నిర్వహించారు. పోటీల్లో చీరాల్లోని విజ్ఞాన భారతి హైస్కూల్, గౌతమి, సెయింట్ ఆన్స్ స్కూలు, కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన 12 మంది క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చీరాల కోచ్ ఎస్‌డీ సలావుద్దీన్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.. అండర్-17 బాలుర 48 కేజీల విభాగంలో వి.హేమంత్, 59 కేజీల విభాగంలో ఎస్‌కే కాలేషావలి, 45 కేజీల విభాగంలో ఎన్.వెంకటరమణ, 55 కేజీల విభాగంలో వి.మనోహర్ ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలికల 55 కేజీల విభాగంలో ఎస్‌కే తాహిర, 44 కేజీల విభాగంలో ఎన్.ప్రవళిక, 52 కేజీల విభాగంలో వై.లక్ష్మీప్రియ, 63 కేజీల విభాగంలో బి.కావ్యలు ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-14 బాలుర 44 కేజీల విభాగంలో ఎల్.కార్తీక్‌మణికంఠ, 41 కేజీల విభాగంలో వి.శరత్ కుమార్, అలానే బాలికల అండర్-14 విభాగంలో 38 కేజీల విభాగంలో ఎస్‌కే తస్లీమా, 24 కేజీల విభాగంలో వి.జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈనెల 10, 11 తేదీల్లో రేపల్లెలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సలావుద్దీన్ తెలిపారు. అండర్-17 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈనెల 18న వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలల నుంచి 69 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్, పీఈటీలు, క్రీడాకారులకు శిక్షణనిచ్చిన కోచ్‌లు సయ్యద్ సలావుద్దీన్, పి.ప్రశాంత్‌బాబును రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి

- తోడువచ్చిన ఆటో డ్రైవర్ పరారు
- గంటల వ్యవధిలో అదుపులోకి నిందితుడు
- మృతుడు గుంటూరు వాసిగా గుర్తింపు

యడ్లపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన కేసును యడ్లపాడు పోలీసులు 24 గంటల్లోనే చేధించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట మార్గంలో మంగళవారం ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన దారుణంగా మృతి చెంది పడిఉన్న కేసును పోలీసులు మూడు బృందాలుగా దర్యాప్తు చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుంటూరు సంగడిగుంట కాలనీకి చెందిన షేక్ రహీంగా గుర్తించారు. ఆటో డ్రైవర్ రాళ్లబండి శివనాగేంద్రబాబు అతని మిత్రుడైన రహీం కలిసి యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్‌పేట గ్రామంలోని బంధువుల ఇంటికి ఈనెల 6వ తేదీన రాత్రి 10.30 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరారు. అయితే వాహనాన్ని అతివేగంగా నడపడం వల్ల బోయపాలెం గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గం వద్ద అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కనే కూర్చున్న రహీం (47) రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడి మృతిని చూసి భయపడ్డ శివనాగేంద్రబాబు ఆటోను లేపి అక్కడి నుంచి వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం స్థానికులు రోడ్డు పక్క మృతి చెందిన రహీంను చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. అదేరోజు సాయంత్రం చెంఘీజ్‌ఖాన్‌పేటలో డ్రైవర్ శివనాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని ప్రమాదానికి కారణమైన ఆటోను స్టేషన్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు మృతుడు తమ కుమారుడేనని నిర్ధారించారు. దీంతో తండ్రి షేక్ సైదా ఫిర్యాదుతో ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రేపు రాష్ట్రస్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్: దివంగత స్విమ్మర్ కానాల అంజినీ శ్రీక్రాంత్‌రెడ్డి స్మారకార్థం ఈనెల 10న 8వ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు నిర్వహిస్తామని మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్ది రమణారావు తెలిపారు. బుధవారం స్థానిక అరండల్‌పేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23 జిల్లాల నుంచి మాస్టర్స్ స్విమ్మర్లు పాల్గొంటారన్నారు. పోటీల్లో విజేతలకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.హరిహరనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలను గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం ఈతకొలనులో ఏర్పాటు చేశామన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పెద్ది రమణారావు, తదితరులు

రేషన్ బియ్యం పట్టివేత

తెనాలిరూరల్: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని పాలాద్రి కాల్వ సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి సుమారు 60 బస్తాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

ఇరుకుపాలెం ఎంపీటీసీ ఆత్మహత్యాయత్నం

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం ఎంపీటీసీ బత్తుల విజయలక్ష్మి బుధవారం బావిలో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కుటుంబ ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు ఆడియో విడుదల చేసింది. గత ఏడాది నవంబర్ లో భర్త రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం గ్రామం విడిచి సత్తెనపల్లిలో నివాసముంటున్నా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆమె వివరించింది. బాధలు తట్టుకోలేక తీవ్ర మనస్థాపంతో బావిలో దూకింది. గమనించిన సమీప బంధువులు బావిలోంచి బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. వైఎస్సార్ సీపీ తరుపున గెలిచి టీడీపీలో చేరారు.

బీరు బాటిళ్లతో యువకుడిపై దాడి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): మద్యం సేవించిన ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీయగా.. యువకుడు గాయపడ్డాడు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుఫాన్ నగర్ ప్రాంతానికి చెందిన గోవింద్ కిరణ్ కుమార్ అనే వ్యక్తి పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన వర్ల కిరణ్‌కుమార్ అలియాస్ బన్ను, గుజ్జర్లపూడి బాల కోటేశ్వరరావు అలియాస్ రూబెన్ అనే వారు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరు ముగ్గురు స్నేహంగా ఉంటారు. అయితే మంగళవారం రాత్రి పలకలూరు రోడ్డులోని ఓ వైన్స్‌లో మద్యం సేవించి కిరణ్‌కుమార్‌తో బన్ను, రూబెన్‌లు వాగ్వివాదానికి దిగారు. ఈక్రమంలో రూబెన్, బన్నులు బీరు బాటిల్‌తో కిరణ్‌కుమార్ పై దాడి చేసి గాయపరిచారు. దీన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా చికిత్స అనంతరం బాధితుడు కిరణ్‌కుమార్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బన్ను, రూబెన్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనారిటీలకు ఖతార్‌లో ఉద్యోగ అవకాశాలు

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్‌లోని దోహాలో హోమ్‌కేర్ నర్సు సేవల కింద ఉద్యోగం చేయాలనుకున్న అర్హులైన మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు) అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు సాబిరా బేగం బుధవారం తెలిపారు. విదేశాల్లో ఉద్యోగం చేయాలని ఆసక్తి ఉన్న యువకులు, అర్హతలను బట్టి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ నెల 13వ తేదీలోగా ఆన్‌లైన్ లింక్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. ప్రధానంగా అభ్యర్థులకు రెజిస్టర్ నర్స్ (హోమ్‌కేర్), బీఎస్సీ, జీఎన్‌ఎం నర్సింగ్, 21నుంచి 40 సంవత్సరాల వయస్సు, స్త్రీ, పురుషులు ఎవరైన దరఖాస్తు చేసుకోవచ్చని, కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. ఉత్సాహవంతులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. www. naipunyam. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13వ తేదీన ఓఎంసీఆర్ ఆఫీసు, గవర్నమెంట్ ఐటీఐ క్యాంపస్, రమేష్ ఆసుపత్రి రోడ్, విజయవాడలో ఇంటర్వ్యూ జరుగుతుందని పూర్తి వివరాల కోసం 9849901142, 9100955737 నంబర్లను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని బాలుడి మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు మణిపురం రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని బాలుడు(17) మృతి చెందిన ఘటన పై జీఆర్పీ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణిపురం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు జీఆర్పీ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు హుటా హుటిన ఘటనా ప్రదేశం వద్దకు చేరుకున్నారు. చుట్టు పక్కలవారిని విచారించగా ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. దీంతో జీఆర్పీ పోలీసులు రైలు ఢీ కొనడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా, లేక రైలులో నుంచి జారి పడి మృతి చెందాడా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన బాలుడు సుమారు 17 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, బిస్కెట్ రంగు డిజైన్ గల హాఫ్ హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు సుమారు 5 అడుగుల ఎత్తు కలిగి ఉంటాడని గుర్తించి పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గుంటూరు రైల్వే జీఆర్పీ ఎస్ఐ దీపిక, 9121715242 నంబర్‌కు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని బుధవారం పరిశీలించారు. సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుని జేబులో ఒంగోలు రైల్వేస్టేషన్‌లో మంగళవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో తీసుకున్న ప్లాట్‌ఫామ్ టికెట్, కుడిచేతిపై వినోద్ అనే పచ్చబొట్టు రాసి ఉందని జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రిబాబు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని కోరారు.